క్లుప్తంగా

ప్రజలకు పరిశుభ్రమైన తాగునీరు



పిడుగురాళ్ల: ప్రజలకు సురక్షితమైన, పరిశుభ్రమైన నీటిని అందించడమే లక్ష్యంగా పని చేస్తున్నామని మున్సిపల్ కమిషనర్ పర్వతనేని శ్రీధర్ అన్నారు. పట్టణంలోని మున్సిపాలిటీ పరిధిలోని వాటర్ ట్యాంక్‌లను శుభ్రపరచటం జరిగిందన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మున్సిపాలిటీలోని ప్రజలకు సురక్షితంగా మంచినీటిని అందించేందుకు ప్రతి నెలా వాటర్ క్లీనింగ్ చేయిస్తున్నామని తెలియజేశారు. సచివాలయ ఏఎన్ఎంల ద్వారా కూడా సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తం చేయిస్తున్నామన్నారు.

మురుగుతో ఇక్కట్లు



గురజాల రూరల్: మురుగు సమస్య పరిష్కారం కావడం లేదని ప్రజలు వాపోతున్నారు. మండల పరిధిలోని దైద గ్రామం ఎస్సీ కాలనీ సమీపంలో రోడ్డుకిరువైపులా మురుగు నీరు పారుతోంది. రహదారి ఏర్పాటు చేశారు కానీ మురుగునీరు పారుదలకు సైడు కాల్వలు నిర్మించలేదు. మురుగు నీరు పారుదలకు అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి సైడు కాల్వలు ఏర్పాటుచేయాలని స్థానిక నివాసితులు కోరుతున్నారు.

అత్యాచారం కేసు నమోదు

మాచవరం: ఇంట్లో ఎవరూ లేని సమయంలో యువతిపై అత్యాచారానికి పాల్పడిన ఘటన మండల కేంద్రంలో గురువారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన యువతి రెండు రోజులుగా అరోగ్యం బాగోలేక ఇంటి వద్దనే ఉంటుంది. అదే గ్రామానికి చెందిన నల్లమేకల వెంకటేష్ ప్రతి రోజూ అదే వీధి గుండా మేకలు తోలుకుంటూ వెళ్తుండేవాడు. ఇంటి తలుపులు తీసి ఉండడంతో ఇంట్లో ఎవరూ లేరని గ్రహించి ఇంట్లోకి ప్రవేశించాడు. యువతి కేకలు వేయకుండా నోట్లో గుడ్డలు కుక్కి అత్యాచారం చేశారు. యువతి తల్లిదండ్రుల రాకను గమనించి అక్కడి నుంచి పారిపోయాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ కె.సతీష్ తెలిపారు.

లగడపాడులో చోరీపై కేసు నమోదు

పెదకూరపాడు: మండల పరిధిలోని లగడపాడు గ్రామానికి చెందిన షేక్ షాహినా ఇంట్లో బుధవారం జగరిగిన చోరీపై గురువారం పెదకూరపాడు పోలీసులు కేసు నమోదు చేశారు. బుధవారం ఉదయం షాహినా తన తండ్రి ఇంటి వద్ద ఉంచి, పొలం పనులకు వెళ్లింది. ఈక్రమంలో షాహినా తండ్రి బంధువుల ఇంటికి వెళ్లిన సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు ఇంట్లోకి ప్రవేశించి ఇంట్లో ఉన్న సుమారు 45 గ్రాముల బంగారు ఆభరణాలు చోరీ చేశారు. పని నుంచి తిరిగి వచ్చిన షాహినా ఇంట్లో ఉన్న ఆభరణాలు ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు దొంగలించుకుని పోయారని నిర్ధారించుకుని బుధవారం రాత్రి పెదకూరపాడు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. దీనిపై పోలీసులు కేసు నమోదు చేశారు. అయితే పోలీసుల అదుపులోకి చోరీ కేసులో నిందితుడు ఉన్నట్లు సమాచారం. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడికి తీవ్ర గాయాలు

సత్తెనపల్లి: రోడ్డు ప్రమాదంలో ఓ వృద్ధుడికి తీవ్ర గాయాలైన సంఘటన పట్టణంలోని గడియార స్తంభం వద్ద గురువారం జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలోని చల్లా వారివీధికి చెందిన వృద్ధుడు, విశ్రాంత ప్రభుత్వ ఉద్యోగి షేక్ మహబూబ్ సుభాని గడియార స్తంభం వద్ద రోడ్డు దాటే క్రమంలో గుంటూరు వైపు నుంచి మాచర్ల వైపు వెళుతున్న పొక్లెయిన్ ప్రమాదవశాత్తు ఢీ కొట్టడంతో ఆయన రెండు కాళ్ల పైకి ఎక్కడంతో తీవ్రగాయాల పాలయ్యాడు. క్షతగాత్రుడికి సత్తెనపల్లి ఏరియా వైద్యశాలలో ప్రాథమిక చికిత్స అందించి మెరుగైన వైద్యం కోసం నరసరావుపేటకు తరలించారు.

మద్యం దుకాణాల నిర్వహణపై ఫిర్యాదు

అమరావతి: మద్యం షాపుల వద్ద నిబంధనలకు విరుద్ధంగా రేకుల షెడ్లు వేసి, నాపరాళ్లపై కూర్చొని మద్యం తాగే విధంగా ఏర్పాట్లు ఉన్నాయని, ఇలా మందుబాబులకు సౌకర్యవంతంగా ఏర్పాట్లు చేస్తున్నారని గురువారం ఎక్సైజ్ సీఐ శ్రీనివాసులుకు ప్రజా సంఘాల కన్వీనర్ బి.సూరిబాబు ఫిర్యాదు చేశారు. ఈసందర్భంగా సూరిబాబు మాట్లాడుతూ గతంలో ఇలాగే అన్ని సౌకర్యాలు కల్పిస్తే, వాటిపై ఫిర్యాదులు వచ్చిన తర్వాత వాటిని తొలగించడం, మళ్లీ మద్యం దుకాణాల వారు ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. అలాగే గురువారం ఎక్సైజ్ సిబ్బంది మద్యం షాపులకు తనిఖీకి వస్తే అధికారుల కళ్లముందే తాగుతున్న మందుబాబులను చూసి అవాక్కయ్యారన్నారు. షెడ్లను కూల్చి, కూర్చోవడానికి ఏర్పాటు చేసిన బల్లలు, నాపరాళ్లు తొలగించి అవసరమైతే ప్రత్యేక నిఘా కెమెరాలను ఏర్పాట్లు చేయాలని కోరామని తెలిపారు.

మండల అధికార పరిషత్

మండల ప్రజా పరిషత్..మండల అధికార పరిషత్‌గా మారింది. ప్రజలు ఎన్నుకున్న ప్రతినిధులకు కూటమి ప్రభుత్వం విలువ లేకుండా చేస్తోంది. అధికార పార్టీ నాయకులు అధికారులను అడ్డుపెట్టి ఎంపీపీలపై పెత్తనం సాగిస్తున్నారు. పంచాయతీ రాజ్ చట్టాన్ని, ప్రజా స్వామ్య వ్యవస్థను పూర్తిగా తుంగలో తొక్కుతున్నారు. ఎంపీపీలను పక్కనపెట్టి వార్డు మెంబరు కూడా కానివారు మండల పరిషత్ కార్యాలయాల్లో హవా సాగిస్తున్నారు.



మాచర్ల మండల ప్రజా పరిషత్ కార్యాలయం

- మండల ప్రజా పరిషత్ అధ్యక్షులకు విలువివ్వని అధికారులు
- ఎంపీపీలను పక్కన పెట్టి దొడ్డిదారిలో కూటమి నేతల పెత్తనం
- పరిషత్ తీర్మానం లేకుండానే పనులు చక్కబెట్టేస్తున్న వైనం
- అధికారిక కార్యక్రమాలకు సమాచరమివ్వని యంత్రాంగం
- మాచర్ల, రెంటచింతల ఇన్‌చార్జి ఎంపీపీల నియామకంలో కుట్రలు
- ఆరు నెలలు గడుస్తున్నా ఉత్తర్వులివ్వని జిల్లా అధికారులు
- కనీసం కార్యాలయాలకు రానివ్వని అధికార పార్టీ నాయకులు

మాచర్ల రూరల్: స్థానిక సంస్థల ఎన్నికలు 2021 జరిగాయి. తెలుగుదేశం పార్టీ ఎన్నికల బరి నుంచి తప్పుకోవడంతో.. మాచర్ల నియోజకవర్గంలోని మాచర్ల, వెల్దుర్తి, దుర్గి, కారంపూడి, రెంటచింతల ఎంపీపీ స్థానాలను వైఎస్సార్ సీపీ ఏకగ్రీవం చేసుకుంది. గత సార్వత్రిక ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. ఎంపీపీలుగా వైఎస్సార్ సీపీ నాయకులు ఉండటంతో కూటమి నేతలు కుట్రలకు తెరలేపారు. ఎంపీడీఓలను అడ్డుపెట్టుకొని ఎంపీపీలను పూర్తిగా పక్కనపెట్టారు. మండల పరిషత్‌పై అడ్డదారిలో పాలన సాగిస్తున్నారు. పంచాయతీ రాజ్ చట్టాన్ని, ప్రజా స్వామ్య వ్యవస్థను పూర్తిగా తుంగలో తొక్కుతున్నారు. ప్రజలెన్నుకున్న ఎంపీపీలను పక్కన పెట్టి గ్రామాల్లో వార్డు మెంబర్లు కూడా కానివారు మండల ప్రజా పరిషత్ కార్యాలయాల్లో పెత్తనం సాగిస్తున్నారు.



ప్రజా ప్రతినిధులు హాజరు కాకపోవడంతో అరకొరగా సర్వసభ్య సమావేశం..

దౌర్జన్యకాండ

ఎంపీపీలను కార్యాలయానికి రానివ్వకుండా అధికార పార్టీ నాయకులు దౌర్జన్యాలకు పాల్పడుతుంటే.. ఎంపీటీసీ సభ్యులకు కనీస గౌరవం ఇవ్వకుండా అధికారులు వ్యవహరిస్తున్నారు. కనీస సమాచారమివ్వకుండా అధికారిక కార్యక్రమాలు కూటమి నేతలతో నిర్వహిస్తున్నారు. ఎంపీపీలను వారి గదుల్లోకి రాకుండా కూటమి నేతలు దౌర్జన్యాలకు పాల్పడుతున్నారు.

అధికారుల ద్వారానే తీర్మానాలు

99 శాతం మంది ఎంపీటీసీ సభ్యుల మెజార్టీ మద్దతు వైస్ ఎంపీపీలు సుజాత, సంపూర్ణకు ఉంది. కానీ, కూటమి నాయకులు సంఖ్యా బలం లేకున్నా దాడులు, దౌర్జన్యాలతో ప్రలోభాలకు గురిచేస్తూ కుట్రలు పన్నుతున్నారు. దొడ్డిదారిన ఎంపీపీ స్థానాలను పొందాలని ప్రయత్నిస్తూ.. ఇన్‌చార్జి బాధ్యతలను ఇవ్వకుండా అడ్డుకుంటున్నారు. ఆర్థిక సంఘం నిధులు ఖర్చు చేయాలన్నా, తీర్మానాలు ప్రవేశపెట్టాలన్నా మండల ప్రజా పరిషత్ సభ్యుల తీర్మానం తప్పనిసరి. వీరి తీర్మానాలు లేకుండానే అధికార పార్టీ నాయకులు అధికారుల ద్వారా అడ్డదారిలో పనులు చేయించుకుంటున్నారు. ఆరు నెలల్లో రెండు సార్లు సమావేశం పెట్టినా మొత్తం ఎంపీటీసీలు సమావేశానికి రాకుండా బాయికాట్ చేశారు. కోరం లేక అధికారులు సమావేశాలను వాయిదా వేస్తున్నట్లు తెలిపారు. ఎంపీపీల వ్యవస్థను నిర్వీర్యపరుస్తూ ప్రజాస్వామ్య వ్యవస్థను అవహేళన చేస్తుండటంపై ప్రజాస్వామ్య వాదులు కూటమి నేతల తీరుపై అసహనం వ్యక్తం చేస్తున్నారు.

అర్ధ ఏడాదిగా..బాధ్యతలివ్వకుండా..

మాచర్ల, రెంటచింతల ఎంపీపీలు బూడిద మంగమ్మ, దాసరి చౌడేశ్వరి అనారోగ్య కారణాలతో ఆరు నెలల క్రితం దీర్ఘకాలిక సెలవుపై వెళ్లారు. స్వయంగా అప్పటి జెడ్పీ సీఈఓ వసంతరాయుడిని కలిసి సెలవు పత్రాలను అందజేశారు. ఎంపీపీలు సెలవుపై వెళితే నిబంధనల ప్రకారం మండల ఉపాధ్యక్షులుగా మొదటగా ఉన్న పోతురెడ్డి సుజాత, పాముల సంపూర్ణకు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించాల్సి ఉంది. ఈ మేరకు అభ్యర్థిస్తూ వారు దరఖాస్తులను అందజేశారు. పంచాయతీ రాజ్ చట్టం ప్రకారం 15 రోజుల్లో ఉత్తర్వులందాల్సి ఉంది. కానీ, జిల్లా అధికారులు ఆరు నెలలు దాటుతున్నా నేటికీ ఆదేశాలు ఇవ్వకపోవడంపై కూటమి నాయకుల కుట్రలకు అధికారులు ఒత్తాసు పలుకుతున్నట్లు స్పష్టంగా తెలుస్తోంది.

జిల్లా అధికారుల చుట్టూ తిరుగుతున్నా..



ఆరు నెలల క్రితం ఎంపీపీ బూడిద మంగమ్మ సెలవుపై వెళ్లారు. ఉపాధ్యక్షురాలు 1గా ఉన్న నేను ఇన్‌చార్జిగా బాధ్యతలు తీసుకోవాల్సి ఉంది. ఈ విషయంపై కలెక్టర్, జెడ్పీ సీఈఓ వద్దకు రెండుసార్లు వెళ్లాను. మొదటి వారంలో ఆర్డర్స్ ఇస్తామని చెప్పారు. నెల తర్వాత వెళ్తే.. చూస్తాం.. చేస్తున్నాం అంటూ కాలయాపన చేస్తున్నారు. ఎంపీడీఓ కార్యాలయంలో సంప్రదిస్తే ఆదేశాలు వచ్చే వరకు మీరు కార్యాలయంలోకి రావద్దు.. అధికార పార్టీ నాయకులు తమపై ఒత్తిడి తెస్తున్నారని చెబుతున్నారు.

– పోతురెడ్డి సుజాత, వైస్ఎంపీపీ, మాచర్ల

కూటమి నేతల కుట్రలు



దీర్ఘకాలిక అనారోగ్యంతో ఎంపీపీ బాధ్యతలను నిర్వహించలేనంటూ స్వయంగా అప్పటి జెడ్పీ సీఈఓ వసంతరాయుడుని కలిసి సెలవు పత్రం అందించా. నా తర్వాత వైస్ ఎంపీపీగా ఉన్న పోతురెడ్డి సుజాతకు ఇన్‌చార్జి బాధ్యతలు ఇవ్వాలని కోరాను. వారం రోజుల్లో ఉత్తర్వులు ఎంపీడీఓ కార్యాలయానికి అందిస్తామని చెప్పారు. ఇప్పటి వరకు ఇవ్వకుండా కాలయాపన చేశారు. ఇందులో కూటమి నేతల కుట్రలు దాగున్నాయి.

–బూడిద మంగమ్మ, ఎంపీపీ, మాచర్ల

దొడ్డిదారిన పెత్తనం



ప్రజాస్వామ్య వ్యవస్థలో స్థానిక సంస్థలకు ఎంతో కీలకం. అలాంటి ఎంపీపీ పదవి విషయంలో కూటమి నాయకులు కుట్రలు పన్నుతున్నారు. ఎంపికైన ఎంపీపీ, ఎంపీటీసీ సభ్యులను పక్కన పెట్టి కనీసం వార్డు మెంబర్ కూడా కాని నాయకులు అధికార పార్టీని అడ్డుపెట్టుకొని దొడ్డిదారిన పెత్తనం చేస్తున్నారు. ఇదేమని ప్రశ్నిస్తే దాడులు చేస్తూ, కేసులు పెడుతున్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థను పటిష్ట పరుస్తామని ఎన్నికలలో చెప్పిన కూటమి నేతలు నేటి ఎంపీపీల పాలనలో జోక్యంపై ఏమని సమాధానం చెబుతారు.

– రమావత్ రంగా నాయక్, ఎంపీటీసీ సభ్యుడు

ప్రకృతి వ్యవసాయం లాభసాటి

దాచేపల్లి: ప్రకృతి వ్యవసాయం లాభసాటిగా ఉంటుందని ప్రకృతి వ్యవసాయం రాష్ట్ర రిసోర్స్ పర్సన్ రామచంద్రన్ అన్నారు. మండలంలోని మాదినపాడు గ్రామంలో రైతు నరసింహారావు ప్రకృతి వ్యవసాయం ద్వారా సాగు చేస్తున్న పంటలను పరిశీలించారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా ఆకుకూరలు, కూరగాయలు, బంగాళదుంప, తీగజాతి, పండ్లు పండిస్తున్నానని, 365 రోజుల పాటు ఆదాయం పొందుతున్నానని ఆయన వివరించారు. రిసోర్స్ పర్సన్ రామచంద్రన్ మాట్లాడుతూ.. వివిధ రకాల జాతుల మొక్కలు సాగు చేయటం వల్ల ప్రకృతి వ్యవసాయం లాభసాటిగా ఉంటుందన్నారు. ఈ విధానం వల్ల భూసారం పెరిగి దిగుబడులు అధికంగా వస్తాయన్నారు. ప్రకృతి వ్యవసాయం విధానం వల్ల పంటల ఖర్చు కూడా గణనీయంగా తగ్గుతుందన్నారు. ప్రకృతి వ్యవసాయం చేసేలా రైతులు ముందుకు రావాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్ట్ మేనేజర్ ప్రేమరాజ్, అధికారులు అప్పలరాజు, సైదయ్య, బాజి బాబు, యూనిట్ ఇన్‌చార్జ్ కొత్తపల్లి రమేష్ పాల్గొన్నారు.

పీహెచ్‌సీలో టాస్క్‌ఫోర్స్ కమిటీ సమావేశం



కారెంపూడి: ఈ నెల 10న జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని విజయవంతానికి మండల టాస్క్‌ఫోర్స్ కమిటీ గురువారం స్థానిక పీహెచ్‌సీలో సమావేశం నిర్వహించింది. అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల్లోని విద్యార్థులకు నులిపురుగుల నివారణకు అల్బెండజోల్ మాత్రలు మింగించేందుకు అమలు చేయాల్సిన కార్యచరణను అధికారులు చర్చించారు. ఆరోగ్యశాఖకు పంచాయతీరాజ్, విద్యా, రెవెన్యూ, ఐసీడీఎస్ శాఖలు సహకరించాలని పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ ఎం.రమ్య కోరారు. తహసీల్దారు ఆర్.వెంకటేశ్వర్లు నాయక్, ఎంఈఓ టి.రవికుమార్, డాక్టర్ కె.లక్ష్మి మౌనిక, డాక్టర్ ఎం.విజయానాయక్, ఇన్‌ఛార్జి ఈఓపీఆర్డీ కె.కస్సిన్యా నాయక్, పీహెచ్‌సీ వివిధ హోదాల ఉద్యోగులు మల్లయ్య, మస్తాన్‌వలి, కేవి మణి, ఎం.లాలునాయక్ పాల్గొన్నారు.

మద్యం షాపుల దరఖాస్తుకు రేపే ఆఖరు

ఎక్సైజ్ శాఖ గుంటూరు డిప్యూటీ కమిషనర్ కె. శ్రీనివాసులు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎక్సైజ్ శాఖ గుంటూరు డిప్యూటీ కమిషనర్

పిడుగురాళ్ల: గీత కార్మికులకు కేటాయించిన మద్యం షాపులకు శనివారంలోపు దరఖాస్తు చేసుకోవాలని ఎక్సైజ్ శాఖ గుంటూరు డిప్యూటీ కమీషనర్ కె. శ్రీనివాసులు తెలిపారు. పట్టణంలోని ఎక్సైజ్ శాఖ కార్యాలయంలో గురువారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. గీత కార్మికులకు మద్యం షాపుల్లో 10 శాతం రిజర్వేషన్ కల్పించడం జరిగిందన్నారు. వారికి మద్యం షాపుల టెండర్లల్లో సగం శాతం మాత్రమే ఫీజు చెల్లించే సదుపాయం కూడా ఉందన్నారు. గుంటూరు జిల్లాల్లో 13 షాపులకు గాను 46 దరఖాస్తులు వచ్చాయని చెప్పారు. వాటిల్లో కాకుమాను, కొల్లిపొర, వట్టిచెరుకు సంబంధించి ఇంకా దరఖాస్తులు రావాల్సి ఉందన్నారు. అదేవిధంగా నర్సరావుపేట జిల్లాల్లో 13 షాపులకు గాను 41 దరఖాస్తులు వచ్చాయని, మాచర్ల మండలం, ముప్పాళ్ల మండలంలో దరఖాస్తులు రావాల్సి ఉందన్నారు. గీత కులాలకు సంబంధించిన వారు మీకు ఎక్కడ అయితే అనుకుంటున్నారో అక్కడ దరఖాస్తు చేసుకోవచ్చునని తెలిపారు. రూ. 2 లక్షల నగదు చెల్లించాల్సి ఉంటుందని ఆయన పేర్కొన్నారు. గుంటూరు, నర్సరావుపేట జిల్లాల్లో గౌడ కులానికి 4, గౌడ కులాలకు 9 షాపులు ఇవ్వటం జరిగిందని ఆయన తెలిపారు. ఈ నెల 8వ తేదీ 5 గంటల లోపు దరఖాస్తులు చేసుకోవాలని ఆయన తెలిపారు. 10వ తేదీ నర్సరావుపేట, గుంటూరులో దరఖాస్తులను లాటరీ తీయడం జరుగుతుందన్నారు.

10న కేఎస్ లక్ష్మణరావు నామినేషన్

పిడుగురాళ్ల: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా కేఎస్ లక్ష్మణ్‌రావు నామినేషన్‌ను విజయవంతం చేయాలని యూటీఎఫ్, సీఐటీయూ నాయకులు పిలుపునిచ్చారు. పట్టణంలోని యూటీఎఫ్ కార్యాలయంలో కరపత్రాలను గురువారం విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఫిబ్రవరి 27న జరగబోయే కృష్ణ, గుంటూరు జిల్లా గ్రాడ్యుయేట్ ఎన్నికల్లో పీడీఎస్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా కేఎస్ లక్ష్మణరావు ఈ నెల 10న నామినేషన్ వేయనున్నట్లు తెలిపారు. మార్కెట్ సెంటర్‌లోని వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో సభా కార్యక్రమం పూర్తి చేసుకొని, భారీ ప్రదర్శనతో జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నామినేషన్ వేయటం జరుగుతుందని తెలిపారు. యూటీఎఫ్ జిల్లా గౌరవ అధ్యక్షుడు ఎస్కే ఖాశీం పీరా, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్కే జమాల్, జిల్లా ప్రచురణ కమిటీ సభ్యులు రవి చంద్రశేఖర్, సీఐటీయూ జిల్లా కార్యదర్శి గోపాలరావు, సీఐటీయూ మండల నాయకులు శ్రీనివాస్, యూటీఎఫ్ నాయకులు ఎంవీ సాంబశివరావు, గోసు ప్రసాదరావు పాల్గొన్నారు.

'సెయింట్ జోసఫ్' వజ్రోత్సవాలకు పీఆర్కే రూ.లక్ష విరాళం



కరస్పాండెంట్, పీటర్ పాపయ్యకు రూ. లక్ష విరాళం అందజేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

రెంటచింతల: మండల కేంద్రంలోని సెయింట్ జోసఫ్ ఉన్నత పాఠశాల చదువుల తల్లిగా రాష్ట్రంలోనే పేరు పొందిందని జిల్లా వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, మాచర్ల మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. శుక్రవారం పాఠశాల వజ్రోత్సవ వేడుకల నేపథ్యంలో గురువారం ఆయన మండల పార్టీ అధ్యక్షుడు గొట్టం బ్రహ్మారెడ్డి, నాయకులతో పాఠశాల కరస్పాండెంట్, రె. ఫాదర్ పీటర్ పాపయ్యకు తనవంతుగా రూ.లక్ష విరాళం పంపించారు. ఈ సందర్భంగా పీఆర్కే మాట్లాడుతూ తాను 6 నుంచి 10వ తరగతి వరకు ఈ పాఠశాలలో చదువుకున్నట్లు తెలిపారు. ఇక్కడ నేర్చుకున్న విలువలు, క్రమశిక్షణతోనే నియోజకవర్గ అభివృద్ధితో పాటు ప్రజలకు సేవలు చేయడం జరిగిందన్నారు. పల్నాడు ప్రాంత అభివృద్ధిలో రోమన్ క్యాథలిక్ మిషన్ (ఆర్సీఎం) సంస్థ సేవలు అభినందనీయమన్నారు. ఈ ప్రాంతంలోని పేద విద్యార్థుల విద్యాభివృద్ధికి పాఠశాలలను నిర్మించి ఎంతో సేవ చేసినట్లు కొనియాడారు. రెంటచింతలలోని సెయింట్ జోసఫ్స్ పాఠశాలలో క్రమశిక్షణ, విలువలతో కూడిన విద్యను అందిస్తూ వేలాది మందికి రాజకీయ, వైద్య, ఆరోగ్య వివిధ రంగాలలో మంచి భవిష్యత్‌ను కల్పించిందన్నారు. ఈ ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థి, విశ్రాంతి ఉపాధ్యాయుడు తుమ్మా లూర్దురెడ్డి, మాజీ జడ్పీటీసీ నవులూరి భాస్కర్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ పార్టీ నాయకులు మద్దిరాల కృష్ణారెడ్డి, గాలి ప్రతాప్‌రెడ్డి, కొమ్మారెడ్డి మర్రెడ్డి, వెన్నా వెంకటేశ్వరరెడ్డి, గొట్టం భాస్కర్‌రెడ్డి, తదితరులున్నారు.

వైభవంగా లక్ష్మీనరసింహస్వామి పొంజు సేవ



మోర్జంపాడులో నరసింహస్వామి ఊరేగింపు

మాచవరం: మండలంలోని మోర్జంపాడు గ్రామంలో లక్ష్మీనరసింహ స్వామి 69వ కల్యాణ మహోత్సవాలు గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉదయాన్నే స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయం నందు వైభవంగా పొంజు సేవా కార్యక్రమం చేపట్టారు. అనంతరం స్వామివారిని ఉగ్ర నరసింహునిగా అలకంరించి, గరుడ వాహనంపై గ్రామ పురవీధుల్లో ఊరేగించారు. స్వామి మాలధారణ ధరించిన భక్తులు ఊరేగింపుగా ముడుపులతో దేవాలయానికి చేరుకొని తమ మొక్కులు చెల్లించుకున్నారు. గ్రామ భక్త భజన బృందం భజన కార్యక్రమం నిర్వహించారు. గ్రామ పరిసర ప్రాంతాల నుంచి ప్రజలు విశేషంగా తరలివచ్చారు. శుక్రవారం స్వామి వారి కల్యాణం కన్నుల విందుగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

హెచ్‌ఎంలకు అల్బెండజోల్ మాత్రల పంపిణీ

రెంటచింతల: మండల పరిధిలోని గ్రామాల్లో ఏడాది నుంచి 19 ఏళ్ల పిల్లలకు అల్బెండజోల్ (పులిపురుగు నివారణ మాత్రలు) వేసి నులిపురుగులను నివారిద్దామని గోలి మెడికల్ ఆఫీసర్ కె. ప్రదీప్‌కుమార్‌రెడ్డి అన్నారు. గురువారం స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఈ నెల 10న జాతీయ నులిపురుగులు నిర్మూలన దినం సందర్భంగా మండలంలోని వివిధ పాఠశాలలకు చెందిన హెచ్‌ఎంలకు నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో పాఠశాలల పిల్లలందరికీ అల్బెండజోల్ మాత్రలను వేయడం ద్వారా పరిపూర్ణమైన ఆరోగ్యవంతులుగా ఉంటారన్నారు. మండలంలోని మొత్తం 54 పాఠశాలల్లో చదువుతున్న 10,200 మంది విద్యార్థులకు అల్బెండజోల్ మాత్రలను వేయడం లక్ష్యంగా హెచ్‌ఎంలు పెట్టుకోవాలని సూచించారు. అనంతరం హెచ్‌ఎంలకు అల్బెండజోల్ టాబ్లెట్స్‌ను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఈఓపీఆర్డీ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఆత్మవిశ్వాసంతో ఉన్నత శిఖరాలకు



మాట్లాడుతున్న జిల్లా బీసీ సంక్షేమాధికారి శివ నాగేశ్వరరావు

రెంటచింతల: ప్రతి విద్యార్థి ఆత్మ విశ్వాసంతో కృషి చేస్తే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని జిల్లా బీసీ సంక్షేమాధికారి శివ నాగేశ్వరరావు అన్నారు. గురువారం స్థానిక బీసీ బాల, బాలికల సంక్షేమ వసతి గృహాల్లోని 10వ తరగతి విద్యార్థులకు వేర్వేరుగా ప్రత్యేక సమావేశాలు నిర్వహించి, మాట్లాడారు. పరీక్షల సమయంలో సమయపాలన పాటించాలన్నారు. విశ్వాసం కోల్పోకుండా నమ్మకంగా పనిని తలపెట్టినప్పుడు తప్పక విజయవంతం అవుతుందన్నారు. తీవ్రమైన కోరిక, సోధించాలనే ఆకాంక్ష ఉన్నప్పుడు లక్ష్యాన్ని చేరుకుంటారన్నారు. దేశ భవిష్యత్తు తరగతి గదుల్లో నిర్మితమవుతుందన్నారు. అనంతరం విద్యార్థులకు ప్యాడ్లు, పెన్నులు పంపిణీ చేశారు. హాస్టల్స్ వార్డెన్‌లు సుశీల, గంగాధర్, బీసీడబ్ల్యూఓ దయాకర్, ఏఎస్‌డబ్ల్యూఓ సుజాతకుమారి, దీపిక, శ్రీనివాసరావు, విద్యావేత్త ఎన్. శ్రీనివాసరావు, పల్లెర్ల కేశవరెడ్డి పాల్గొన్నారు.

తిరునాళ్ల వేలం ఆదాయం రూ.3.90 లక్షలు



వీరభద్ర మల్లేశ్వరస్వామి దేవస్థానంలో వేలం నిర్వహిస్తున్న దేవదాయశాఖ అధికారులు

క్రోసూరు: ఈనెల 12న అచ్చంపేట మండలంలోని ఓర్వకల్లు లోని గంగాదేవీ పేరంటాళ్లమ్మవారి తిరుణాళ్ల కోసం గురువారం నిర్వహించిన హక్కుల వేలం పాటల ద్వారా దేవదాయశాఖకు రూ.3.90లక్షలు ఆదాయం సమకూరినట్లు ఈఓ ఒ.కోటేశ్వరరావు తెలిపారు. తిరునాళ్ల సందర్భంగా పలు రకాల వ్యాపారాలు నిర్వహించుకునేందుకు దేవస్థానం స్థానిక వీరభద్రమల్లేశ్వరస్వామి దేవస్థాన ప్రాంగణంలో పాటలు నిర్వహించింది. పాటల ద్వారా గత ఏడాది రూ.3,30,000 సమకూరగా ఈఏడాది రూ.3,90,000 సమకూరిందన్నారు. గత ఏడాది కంటే ఈ ఏడాది అదనంగా రూ.60 వేలు అదనంగా ఆదాయం సమకూరిందని ఈఓ తెలియచేసారు. దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ ఎం.లీలావతి, సిబ్బంది పాల్గొన్నారు.

9న ఉచిత గుండె మెడికల్ క్యాంప్

పిడుగురాళ్ల: రోటరీ క్లబ్ ఆఫ్ పిడుగురాళ్ల లైమ్ సిటీ, శ్రీ బాలాజీ హాస్పిటల్ ఆధ్వర్యంలో మెగా కార్డియాక్(గుండె) క్యాంప్‌ను పట్టణంలోని ఆర్యవైశ్య కల్యాణ మండపంలో జరుగుతుందని నిర్వాహకులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు జరుగుతుందన్నారు. పద్మశ్రీ అవార్డు గ్రహిత ఆళ్ల గోపాల కృష్ణ గోఖలే హాజరు కానున్నట్లు తెలిపారు. ముందుగా రిజిస్ట్రేషన్ చేయించుకున్న 100 మందికి మాత్రమే ఈ అవకాశం ఉంటుందన్నారు. వివరాలకు 93963 50601, 98662 88000, 98491 53440 నంబర్లకు సంప్రదించాలన్నారు.

వైద్యశాలలో అన్న సంతర్పణ

సత్తెనపల్లి: పట్టణంలోని ప్రభుత్వ ఏరియా వైద్యశాలలో నిరుపేద రోగులు, వారికి సహాయ కులుగా వచ్చిన వారికి వైద్యశాలలో నర్సింగ్ సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న మండవ రాధ ఆమె కుమార్తె ఎన్ఆర్ఐ యర్రా వినీల జన్మదినం సందర్భంగా గురువారం 120 మందికి అన్న సంతర్పణ నిర్వహించారు. ఈ సందర్భంగా దాతలను పలువురు అభి నందించారు. కార్యక్రమంలో ఏరియా వైద్యశాల అభివృద్ధి కమిటీ సభ్యులు జవ్వాజి రామమోహన్‌రావు, నాయకులు అప్పాపురపు నరేంద్ర, పులిపాటి శ్రీరామ్‌మూర్తి, కొత్త లక్ష్మయ్య, పోతుగంటి రామకోటేశ్వరరావు, ఎస్‌వీఎల్ నరసింహారావు, దూప గుంట్ల జానకిరామారావు, దివ్వెల శ్రీనివాసరావు, కట్టమూరు అప్పారావు, పోతుగంటి నరసింహారావు,కోటేశ్వరరావు, వైద్యశాల ఉద్యోగులు జి.విజయలక్ష్మి, కాగిత మాధవి దేవి, బంగారు పాప, సునీత, న్యాయవాదులు పాల్గొన్నారు.

వజ్రోత్సవాలకు సర్వం సిద్ధం



రెంటచింతల: స్థానిక సెయింట్ జోసఫ్స్ ఉన్నత పాఠశాల వజ్రోత్సవ వేడుకలకు సర్వం సిద్ధమైనట్లు పాఠశాల కరస్పాండెంట్ రె.ఫాదర్ ఎం. పీటర్ పాపయ్య, స్కూల్ హెచ్‌ఎం సీహెచ్ దుర్గాప్రసాద్ గురువారం తెలిపారు. శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి ఈ వేడుకలు జరుగుతాయన్నారు. మధ్యాహ్నం 12.30 గంటలకు విందు, 2.30 గంటలకు నుంచి పూర్వ విద్యార్థులకు ఆటలు పోటీలను నిర్వహించనున్నట్లు తెలిపారు. సాయంత్రం 5 గంటల నుంచి నిర్వహించే వజ్రోత్సవాల్లో పాఠశాల పూర్వ హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొని, జయప్రదం చేయాలని ఆయన కోరారు.